'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి



కమలాపూర్: సర్పంచ్‌కు కంటివెలుగు ఆహ్వానపత్రిక అందజేస్తున్న అధికారులు



నడికూడలో..

కమలాపూర్: ఈనెల 19 నుంచి కమలాపూర్ మండలంలో ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి.పల్లవి సూచించారు. కమలాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు మాదన్నపేటలో, ఉప్పల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో భీంపల్లిలో నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను వైద్యులు, వైద్యసిబ్బందితో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. అంధత్వ రహిత తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ అక్ష్యానికి అనుగుణంగా పని చేసిన అంధత్వ నివారణకు పాటు పడాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కమలాపూర్, మాదన్నపేట, భీంపల్లి గ్రామాల సర్పంచులు కట్కూరి విజయతిరుపతిరెడ్డి, గుండపు చరణ్‌పటేల్, జవ్వాజి పద్మకుమారస్వామి, ప్రజాప్రతినిధులకు కంటి వెలుగు కార్యక్రమ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి డాక్టర్ హర్షిణీప్రియ, హెచ్ఈఓ రమేష్, ఈఓ రాజారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: కంటివెలుగు శిబిరాలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మాధవీలత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ లలితాదేవి సోమవారం సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగుశిబిరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారిణులు మాట్లాడుతూ మండలంలో రెండు టీంలు పర్యటించి కంటిపరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ నెల 18న మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఒక బృందం, ఊరుగొండలోని రైతు వేదికలో మరొక బృందం పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. మండలంలో ఈ పరీక్షలు ఏప్రిల్ వరకు కొనసాగుతాయని వెల్లడించారు. వారి వెంట ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్ రావు, మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, డాక్టర్ ఉషారాణి, హెచ్ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, ఏఎన్ఎంలు పద్మ, శోభారాణి, మరియు ఆశలు ఉన్నారు.

నడికూడలో..



దామెరలో..

నడికూడ: కంటివెలుగును విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికను మండల వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్ రావు, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ బాలకృష్ణ, హెచ్ఈఓ డాక్టర్ సంపత్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎలిజబెత్, ఎఎన్ఎం విజయలక్ష్మీ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవమానాలు భరించలేకనే రాజీనామా



విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాశ్

భీమదేవరపల్లి: సీనియర్ల వేధింపులు, పార్టీలో సముచిత గౌరవం లేనందునే తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసినట్లు వివరించారు. కానీ సీనియర్లు తనను అవమానపరుస్తూ పార్టీకి చెడ్డపేరుతేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో తనకు సరైన గుర్తింపులేకపోవడంతోనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మండల శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి చెబుతానని వెల్లడించారు. కాగా ప్రకాశ్ త్వరలో బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరనున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కాగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన వారిలో ఒద్దుల సంపత్, పొన్నాల మురళి, తాళ్లపల్లి కిరణ్, షేక్ మౌలాన, షేక్ వలీ, మాట్ల మొగిలి, గొల్లపల్లి రవి, శంకర్, యాకుబ్, వీరస్వామి, యాదగిరి, లింగయ్య, వీరభద్రయ్య, మోహన్ ఉన్నారు.

ముగిసిన ఉచిత హోమియో వైద్యశిబిరం



ఈఓకు ధన్యవాదాలు తెలుపుతున్న ఓరుగల్లు హోమియోపతి అసోసియేషన్ సభ్యులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతరలో మూడు రోజుల పాటు ఉచిత హోమియో శిబిరం ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ప్రధాన కార్యదర్శి పావుశెట్టి శ్రీధర్ తెలిపారు. ఆలయంలో స్థలం కేటాయించినందుకు ముగింపు సందర్భంగా సోమవారం ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బీమగాని లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్‌రావు, బాసాని శ్రీకాంత్, వివి రెడ్డి, రాంబాబు, మాధవరావు, పవన్‌కుమార్, శౌరీ, సాయికృష్ణ, గీతారాణి పాల్గొన్నారు.

కనుల పండువగా సంక్రాంతి నోము



సంక్రాంతి నోము నోచుకుంటున్న మేఘన-ప్రణయ్, వారి బంధువులు

కమలాపూర్: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్త పెళ్లి కూతురుకు పుట్టినింట్లో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి నోము (పెళ్లి నోము) నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన కొనిశెట్టి మునీందర్-మాధవి దంపతుల కూతురు నాగమల్ల మేఘన-ప్రణయ్ ఆదివారం అతిథులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో కమలాపూర్‌లో సంక్రాంతి నోము కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలు, కైలాస పర్వతం, లాలి గౌరమ్మ, బృందావనం, శ్రీకృష్ణ తులాభారం, పవళింపు సేవ వంటి కార్యక్రమాలతో నోములు నోమి వాకిట్లో వడ్ల రాశి, పసుపు తోట, ధనం, ధాన్యం, గోసేవ, మైనం గౌరమ్మ పీటలు, ఎదుర్కోళ్ల పసుపు, నైవేద్యం గిన్నెలు, మంగళ హారతులు, అన్నదానం ప్లేట్లు తదితర 51 రకాల కానుకలను అతిథులు, బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశారు.

ఇన్వర్టర్ పేలి భారీ అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువులు

శాయంపేట: ఇంట్లోని ఇన్వర్టర్ పేలి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన సోమవారం శాయంపేట మండలం గట్లకనిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు బస్వోజు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంట్లో ఆన్‌లైన్ సెంటర్, కంగన్‌హాల్, కులవృత్తి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కొత్తకొండ జాతరకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లోని ఇన్వర్టర్ పేలి ఇల్లు మొత్తం మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.1లక్ష నగదు, మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.ఆర్ఐ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, ఉపసర్పంచ్ బోడకుంటి సురేష్, ప్రజాప్రతినిధులు కోరారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



బహుమతులు ప్రదానం చేస్తున్న వెంకట్రామ్‌రెడ్డి



రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న యువకులు

ఆత్మకూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇనగాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలకు ఆదివారం ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సన్మార్గంలో పయనించాలన్నారు.

ముగిసిన షటిల్ పోటీలు

ఆత్మకూరు: ఆత్మకూరు సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏరుకొండ వెంకటమ్మ-రాములు, సాంబయ్య జ్ఞాపకార్థం షటిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్‌గౌడ్‌ను యువకులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

కాజీపేట : స్థానిక చైతన్యపురికాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గోదాదేవి, పద్మావతి సమేత శ్రీనివాసుల కల్యాణ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి రఘురామాచార్యులు, బ్రహ్మశ్రీ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పండితులు వివాహ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పంజాల అశోక్‌కుమార్ గౌడ్, నరేందర్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



స్వామివారి దర్శనం క్యూలో నిలుచున్న భక్తులు



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర: మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం గ్రామంలోని ఆలయం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏనుగు వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను వేడుకగా గ్రామం సమీపంలోని గుట్టపై ఉన్న గుడిలోకి తీసుకొని వచ్చారు. సోమవారం తెల్లవారుజాము నుంచి జాతరకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లాలతో పాటు, ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. జాతర ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందిరాకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

జాతర అభివృద్ధికి కృషి –ఎమ్మెల్యే ధర్మారెడ్డి

జాతర అభివృద్ధికి కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, అర్చకులు తూపురాణి గీతాచార్యులు, అఖిల్‌కుమార్, వినయ్‌కుమారచార్యులు, బాలకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చన అభిషేకాలు, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే రూ. 1.25కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుచేసి మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వీణామెడికేర్, శ్రీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం ప్రారంభించారు. ఆయన వెంట డాక్టర్ అశోక్‌కుమార్, ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనక్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ ఎండీ. జాకీర్‌అలీ, మండల అధ్యక్షుడు గండు రాము, సర్పంచ్‌లు గోగుల సత్యనారాయణ రెడ్డి, వడ్డెపల్లి శ్రీనివాస్, పురాణం రాజేశ్వరితఋశ్వర్, పాక్స్ చైర్మన్ బొల్లు రాజు, శ్రీరాం ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరాంరెడ్డి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, మెంతుల రాజు, సునీల్ రెడ్డి, సాంబయ్య, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

సంబురంగా సంక్రాంతి వేడుకలు



కమలాపూర్: ముగ్గులు వేస్తున్న మహిళ



నడికూడలో..

పరకాల: సంక్రాంతి పర్వదిన వేడుకలను ఆదివారం పట్టణ ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేయడంతో పాటు పిండిపదార్థాలు తయారు చేసుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు.

బీఆర్ఎస్ అభిమాని నిరసన

గ్యాస్ ధరను విపరీతంగా పెంచడంపై బీఆర్ఎస్ అభిమాని అయిన ఓ మహిళ సంక్రాంతిముగ్గుతో నిరసన తెలిపింది. గ్యాస్ ధరను రూ.1200 పెంచిన మోదీ పాలన మాకొద్దు..దేశ్‌కీ నేత కేసీఆర్ అంటూ వేసిన ముగ్గును ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

నడికూడ: మండల కేంద్రంలో ఆదివారం సంక్రాంతి సంబురాలు ఆదివారం ఇంటిల్లిపాది ఘనంగా జరుపుకున్నారు.

కమలాపూర్: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు, యువతులు తమ తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు అలంకరించి ఆవుపేడతో చేసిన గౌరవమ్మలు, నవధాన్యాలు పెట్టారు. మండలం నుంచి పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో కొత్తకొండకు తరలివెళ్లి కోరమీసాల వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్కతుర్తి: మండలంలో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల లోగిళ్ల ముందు కరకకాల ముగ్గులు వేసి వాటికి రంగులు అద్దారు. ముగ్గులపై ఆవుపేడతో చేసిన గౌరవమ్మలు పెట్టి నవధాన్యాలు పోశారు.

శాయంపేట: మండల పరిధిలోని గ్రామాలలో ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయమే తమ ఇళ్ల ముందు రంగురంగులతో ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. మండలంలోని శ్రీ వెంకటేశ్వర శివ మార్కండేయ ఆలయంలో శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు, వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు.

బాలబాలికలకు అందించే సేవల గురించి అవగాహన



ఐనవోలు: చైల్డ్ హెల్ప్‌లైన్-1098 బాలబాలికలు అందజేసే సేవల గురించి జాతరకు వచ్చిన భక్తులకు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించినట్లు బాలల పరిరక్షణ విభాగం డీసీపీఓ సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో తప్పిపోయిన పిల్లలు, మహిళలు, వృద్ధులు, వ్యక్తుల సహాయ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. డీసీపీ వెంకటలక్ష్మి పాల్గొని నిర్వాహకులను అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, శిశు గృహ ఇన్‌చార్జ్ చైతన్య, చైల్డ్ లైన్ టీం మెంబర్స్ రమేష్, శృతి, రవికృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ ఇంటి నుంచి కొత్తకొండకు రథం



భీమదేవరపల్లి: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఇంటి నుంచి ఎడ్లబండి రథాన్ని కొత్తకొండ జాతరకు వెళ్లేందుకు పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, మనవడు రాఘవేంద్ర కశ్యప్, పీవీ సోదరుడి కుమారులు పీవీ సీతారామారావు, మదన్ మోహన్ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామస్తులు రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంగర నుంచి కొత్తకొండ వరకు రథాన్ని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో లక్ష్మీకాంత్, బత్తిని శ్రీనివాస్, సర్పంచ్ నల్లగోని రాజు, ఎంపీటీసీ కౌసల్య, మాజీ సర్పంచ్‌లు ఆర్. వెంకట్‌రెడ్డి, కండె రమేష్ తిరుపతి, మొండయ్య, లక్ష్మీకాంత్, పిడిశెట్టి రాజు, సతీష్‌రెడ్డి, ఒల్లాల రమేష్, కండె చక్రపాణి తదితరులున్నారు.

ముస్లిం మహిళల సమావేశం



ఆత్మకూరు: మండలంలోని హౌజ్‌బుజుర్గ్‌లో ఆదివారం అహ్మదీయ ముస్లీం స్త్రీల విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ రబీయాబీ హుస్సేన్ మాట్లాడుతూ లజ్నై మాయిల్లాహ్ ఏర్పాటై వందేళ్లు పూర్తైందన్నారు. ఈకార్యక్రమంలో షేడ్ అయిషా ఉమర్, మదీహ, మస్తానీ, మున్నేశ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదినం

పరకాల: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, యూపీ మాజీ ముఖ్యమంత్రి మాయావతి జన్మదినాన్ని పరకాల పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ పరకాల నియోజకవర్గ అధ్యక్షుడు ఎల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన్మదినోత్సవాన్ని పరకాల బస్టాండ్ కూడలిలో చేపట్టగా ముఖ్యఅతిథిగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బొల్లంపల్లి సారయ్య, జిల్లా నాయకుడు శనిగరపు రాజు హాజరయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఎస్పీ నాయకులు పెండెల మహేందర్, పసుల భిక్షపతి, సరిత, శనిగరపు వెంకటేష్, రజనీకాంత్, బండ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో తప్పిపోయిన బాలిక అప్పగింత



భీమదేవరపల్లి: మండలంలోని కొత్తకొండ జాతరకు వచ్చి తప్పిపోయిన బాలికను పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వంగర ఎస్సై మౌనిక రెడ్డి కథనం ప్రకారం వివరాలు.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రాచర్ల చందు తన కుటుంబసభ్యులతో జాతరకు రాగా ఆయన ఏడు సంవత్సరాల కూతురు తప్పిపోగా, వంగర ఎస్సై మౌనిక రెడ్డి సదరు బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

స్నేహితుల చేయూత

శాయంపేట: మండలంలోని చిన్నకోడెపాక గ్రామానికి చెందిన కునూరు రాజేందర్ తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. రాజేందర్‌తో పదవ తరగతి చదివిన 1998-99 కొప్పుల జెడ్పీహెచ్ఎస్ స్నేహితులు రూ. 25వేల ఆర్థిక సాయం అందించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ధర్మసాగర్: మండలంలోని తాటికాయల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2003-04 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించున్నారు. ఈసందర్భంగా 20 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకుని పాఠశాలలో ఆనాటి స్మృతులను గుర్తుచేసుకుంటూ సంబురాలు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సత్యం, మస్తాన్, సమ్మయ్య, వెంకట్ రెడ్డి, రమాదేవి, మంజుల, స్వరూపరాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఐపీ పాస్‌లు షాపులలో లభ్యం

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దర్శనానికి ఉపయోగించే వీఐపీ పాస్‌లు షాపులలో లభ్యం అయినట్లు గొర్రెలు, మేకలపెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల కార్యదర్శి నల్లబెల్లి చిన్నరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆలయం నుంచి ఇచ్చే వీఐపీ పాసులు షాపులకు ఎలా చేరాయని ప్రశ్నించారు. దుకాణదారులు రూ.500లకు ఒక పాస్ చొప్పున అమ్ముకుంటున్నారన్నారని చెప్పారు. ఆలయ అధికారులు, దుకాణదారులతో కుమ్మక్కై అవినీతికి పాలపడుతున్నట్లు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కొబ్బరి కాయ ఆలయం వెలుపల రూ. 15 నుంచి 20 మధ్య అమ్ముతుంటే ఆలయ ప్రాంగణంలో రూ.50కి అమ్ముతున్నారన్నారు. జాతర మొదటిరోజు రూ.150కి రెండు కొబ్బరి కాయలు అమ్మినప్పటికీ ఆలయ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఆలయ హుండీ లెక్కింపులో కలెక్టర్ జోక్యం చేసుకుని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల సమక్షంలో హుండీ లెక్కింపు జరగాలని డిమాండ్ చేశారు.

వన్యప్రాణులను రక్షించుకోవాలి

శాయంపేట: వన్యప్రాణులను రక్షించుకోవాలిన్న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు మారపల్లి సునీల్ అన్నారు. మండల కేంద్రంలో మినీ సర్కస్ నిర్వాహకులు చెరువులు, కుంటలు వద్దకు వచ్చే వలస పక్షులను ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా పక్షుల వాయిస్‌తో వలపన్ని బోన్ల సహాయంతో పట్టుకుని చంపతున్నారని తెలుసుకుని ఆదివారం వారికి సునీల్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అటవీ పక్షులను చంపితే ఫారెస్టు అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. అటవీ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి తమ పద్ధతిని మార్చుకోకుండా మరల వేట కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సునీల్ కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆత్మకూరు: మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన లక్కమారి కాపు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ ప్రాంగణంలో సంఘం అధ్యక్షులు ఎరుకల అశోక్, కమిటీ సభ్యులు పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ లక్కమారి కాపులందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కదుదల రాజేందర్, ప్రధాన కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యులు ఎరుకల రాజేష్, విజేందర్, పెండ్లి మహేష్, రఘు, రాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి



శాయంపేట: ఆరె కులస్తుల సమస్యల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆరె సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వజీరు కిషన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొత్తగట్టుసింగారం గ్రామంలో ఆరె సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు దుర్నాల రాజు, జిల్లా ముఖ్య సలహాదారు లింగమూర్తి, నాయకులు మనోహర్, రామేశ్వర రావు, భాస్కర్, చంద్రరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ దేవు సాంబయ్య తల్లి లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించింది. సోమవారం బీజేపీ అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీకి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తహారాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బూర ఈశ్వరయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నాయకులు మొగిళి, రమేష్, రామకృష్ణ, నాగరాజు, మహేష్, రాకేష్‌రెడ్డి, సత్యనారాయణ, సుమన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.